MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 5 | మంగళవారం 30 డిసెంబర్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-






# అమల్లోకి కొత్త జిల్లాలు

**కొత్త జిల్లాల ఏర్పాటుపై ప్రభుత్వం తుది నోటిఫికేషన్**

**రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేసినట్లు, మార్కాపురం కేంద్రంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసినట్లు నోటిఫికేషన్**

**ఇక రాష్ట్రంలో 5 కొత్త రెవెన్యూ డివిజన్లను కూడా ఏర్పాటు**

**రాష్ట్రంలోని రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల్లో మార్పులు**

**కొత్త జిల్లాల ఏర్పాటుతో ఏపీలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి పెరిగింది**

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుపై తుది నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదల చేసింది. ఏపీలో కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. రంప చోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేసినట్లు, మార్కాపురం కేంద్రంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇక రాష్ట్రంలో 5 కొత్త రెవెన్యూ డివిజన్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపింది. దీనివల్ల రాష్ట్రంలోని రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల్లో మార్పులు జరిగాయి. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఏపీలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి పెరిగింది. ఈ మార్పులు బుధవారం నుంచి అమల్లోకి రానున్నాయి. మార్పుల్లో నందిగామ మండలాన్ని - మిగతా 3లో

## ఏపీ గ్రూప్-2 అభ్యర్థులకు భారీ ఊరట



**గ్రూప్-2 రిజర్వేషన్లపై పిటిషన్లు కొట్టివేసిన ఏపీ హైకోర్టు...**

**నియామకాలకు లైన్ క్లియర్**

**గ్రూప్-2 రిజర్వేషన్లపై హైకోర్టు కీలక తీర్పు**

**రోస్టర్ పాయింట్లపై దాఖలైన అన్ని పిటిషన్లను తోసిపుచ్చిన ధర్మాసనం**

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ గ్రూప్-2 అభ్యర్థులకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. గ్రూప్-2 నియామకాల్లో రిజర్వేషన్ రోస్టర్ పాయింట్లను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లన్నింటినీ ఏపీ హైకోర్టు కొట్టివేసింది. మంగళవారం వెలువడిన ఈ తీర్పుతో గత కొంతకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. ఈ నిర్ణయం లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపశమనం కలిగించింది. 2023లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ -మిగతా 3లో

## గతేడాది కంటే అదనంగా 8 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

గతేడాది కంటే ఈ ఖరీఫ్‌లో రైతుల నుంచి ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అదనంగా కొనుగోలు చేశామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్‌లో మొత్తం 34.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. సచివాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. '5.59 లక్షల మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.8,206 కోట్లు చెల్లించాం. రైతులు నష్టపోకుండా మద్దతుధర అందించాం. కూటమి ప్రభుత్వంపై విశ్వాసంతో అనేకమంది పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా కింద రూ.50 వేల కోట్లు పింఛన్ల కింద ప్రజలకు అందజేశాం. గత ప్రభుత్వం గ్రామాలను నిర్లక్ష్యం చేయగా.. ప్రస్తుతం పెద్దఎత్తున రోడ్లు నిర్మిస్తున్నాం. ఇందుకోసం తాజాగా రూ.2,500 కోట్లు కేటాయించాం. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పల్లె పండగ కార్యక్రమాన్ని చేపట్టి, పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేయిస్తున్నారు.



## లోక్‌భవన్ సిబ్బందికి సీపీఆర్ శిక్షణ

(అంకుశం, విజయవాడ, డిసెంబర్ 30):



ప్రభుత్వ సిబ్బందిలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని, ప్రాణరక్షణ నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో లోక్‌భవన్ సిబ్బందికి మంగళవారం సీపీఆర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ %-% భారతీయ రీసస్సిటేషన్ కౌన్సిల్ ఫెడరేషన్ సహకారంతో నిర్వహించారు. కార్యక్రమానికి డా. పి. చంద్రశేఖర్, వైస్ ఛాన్సలర్, డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రాణాధార శిక్షణను కేవలం వైద్య సిబ్బందికే పరిమితం చేయకుండా, సమాజంలోని ప్రతి పౌరుడికి విస్తరించాలనే విశ్వవిద్యాలయ దృష్టిని వివరించారు. అలాగే, వైద్యేతర సిబ్బందికి రీసస్సిటేషన్ శిక్షణ ఎంత ముఖ్యమో తెలియజేశారు. ఈ శిక్షణను రెండు విడతలుగా నిర్వహించగా, మొత్తం 100కు పైగా లోక్‌భవన్ సిబ్బందికి శిక్షణ అందించబడింది. కార్యక్రమంలో ఇంటరాక్టివ్ లెక్చర్లు, మానెకిన్‌లపై సీపీఆర్ ప్రాక్టీస్ నిర్వహించబడింది. దీని ద్వారా పాల్గొన్నవారికి అత్యవసర పరిస్థితుల్లో స్పందించే ఆత్మవిశ్వాసం పెరిగింది.

## తిరుమలలో వైభవంగా వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభం

**టీటీడీ ఏర్పాట్లపై భక్తుల సంతృప్తి**

**శ్రీవారి ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షించిన టిటిడి ఛైర్మన్, ఈవో, అదనపు ఈవో**

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి తిరుమల**

తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రతిష్టాత్మకమైన వైకుంఠ ద్వార దర్శనాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తుల గోవిందనామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. శ్రీవారి దర్శనానంతరం భక్తులు వైకుంఠ ద్వార ప్రవేశం చేశారు. శ్రీవారి ఆలయం, బయటి క్యూలైన్లలో ఏర్పాట్లను టీటీడీ ఛైర్మన్ శ్రీ బీ.ఆర్.నాయుడు, ఈవో శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏర్పాట్లపై పలువురు భక్తులను అడిగి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ పర్వదినం సందర్భంగా టీటీడీ ప్రత్యేకంగా చేపట్టిన ఏర్పాట్లపై భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు మీడియాతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అద్భుతమైన ఏర్పాట్లు చేసినట్లు - మిగతా 3లో



## కొబ్బరి రైతులకు హామీ ఇచ్చాం.. అమలు చేశాం



- రూ. 20.77 కోట్లతో పనులకు శ్రీకారం.
- శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం
- 45 రోజుల్లో సమస్య పరిష్కారానికి యాక్షన్ ప్లాన్ తో వస్తామని చెప్పాం
- 35 రోజుల్లోనే శంకరగుప్తం డ్రెయిన్ ఆధునికీకరణకు అడుగులు వేశాం
- రైతుల ఆవేదన మనసుతో విని నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

కోనసీమ కొబ్బరి రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ రూ. 20.77 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు శ్రీకారం చుట్టినట్లు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వెల్లడించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం పవన్ కళ్యాణ్ వర్చువల్‌గా పాల్గొనగా డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శంకర గుప్తంలో నిర్వహించిన కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ - మిగతా 3లో

# తిరుమలలో వైభవంగా వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభం

-మొదటిపేజీ తరువాయి

చెప్పారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లతో వైకుంఠ ద్వార దర్శనాలు కొనసాగుతున్నాయని చెప్పారు. టీటీడీ చేసిన ఏర్పాట్లపై భక్తులందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలియజేశారు. టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ మాట్లాడుతూ వేకువజామున 12.05 గంటలకు వైకుంఠ ద్వారాలు తెరిచిన అనంతరం అర్చకులు స్వామివారికి నిత్య కైంకర్యాలు నిర్వహించి వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభించామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వైకుంఠ ద్వార దర్శనాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేశామన్నారు. తొలిమూడు రోజులు ఈ-డిప్ ద్వార టోకెన్లు పొందిన భక్తులకు మాత్రమే దర్శనం ఉంటుందని తెలిపారు. టోకెన్ లేని భక్తులు జనవరి 2 నుండి 8వ తేది వరకు సర్వదర్శనం క్యూలైన్ల ద్వారా వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకోవచ్చని చెప్పారు. టీటీడీ ప్రత్యక్ష పర్యవేక్షణ ద్వార ఇచ్చే సూచనలను పాటిస్తూ దర్శన ప్రణాళికలను రూపొందించుకుంటే ఎలాంటి ఇబ్బందిలేకుండా స్వామివారిని దర్శించుకోవచ్చని చెప్పారు. దాదాపు 3500 మంది పోలీసు, విజిలెన్స్ సిబ్బంది పగడ్బందీ ప్రణాళికలతో భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరం భద్రతను పర్యవేక్షిస్తూ ఎలాంటి ఇబ్బంది కలగకుండా సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. తొలిమూడు రోజుల పాటు టోకెన్ కలిగిన భక్తులు నిర్దేశిత టైమ్ స్లాట్ ప్రకారం దర్శన క్యూలైన్లకు వచ్చి స్వామివారిని దర్శించుకోవాలని తెలియజేశారు.



### వైభవంగా స్వర్ణరథోత్సవం

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం తిరుమలలో స్వర్ణరథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 9 నుండి 10.30 గంటల నడుమ శ్రీవారి రథరంగ డోలోత్సవాన్ని పురమాడ వీధుల్లో నేత్రపర్వంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ పర్వదినాన తిరుమల శ్రీవారి ఆలయంలో అన్ని ఆర్జిత సేవలను రద్దు చేశారు. శ్రీవారి ఆలయంలో శోభాయమానంగా పుష్పాలంకరణ

శ్రీవారి ఆలయంలో ఏర్పాటుచేసిన పుష్పాలంకరణలు ఆకట్టుకున్నాయి. మహద్వారం నుంచి ధ్వజస్తంభం వరకు, వైకుంఠ ద్వారంలో సంప్రదాయం ఉట్టిపడేలా పలురకాల పండ్లు, సువాసనలు వెదజల్లే రంగురంగుల పుష్పాలు, పత్రాలతో శోభాయమానంగా అలంకరణలు చేపట్టారు. వైకుంఠ ప్రదక్షిణ చేసే భక్తులకు గొప్ప అనుభూతి పొందేలా ముస్తాబు చేశారు. పది రోజుల పాటు 50 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 10 టన్నుల ఫలాలు, నాలుగు టన్నుల కట్ ఫ్లవర్స్ అలంకరణలకు వినియోగించనున్నారు.

ఆకట్టుకున్న శ్రీరంగనాథ స్వామి ఆలయ సెట్టింగు

శ్రీవారి ఆలయం వద్ద శ్రీరంగనాథ స్వామి ఆలయ సెట్టింగు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. టీటీడీ ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీ శ్రీనివాసులు పర్యవేక్షణలో దాత సహకారంతో దీన్ని ఏర్పాటుచేశారు.

వైకుంఠ ద్వాదశినాడు చక్రస్నానం

వైకుంఠద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం 4.30 నుండి 5.30 గంటల నడుమ శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నానమహోత్సవం వైభవంగా జరుగనుంది. ఈ సందర్భంగా శ్రీస్వామి పుష్కరిణి తీర్థంలో చక్రస్నాన సుముహూర్తాన ఎవరైతే స్నానమాచరిస్తారో అటువంటి వారికి తిరుమల శేషగిరులలో వెలసివున్న 66 కోట్ల పుణ్యతీర్థ స్నానఫలం దక్కుతుందన్నది ప్రాశస్త్యం. కాగా వైకుంఠద్వాదశినాడు కూడా తిరుమల శ్రీవారి ఆలయంలో ఆర్జితసేవలను టిటిడి రద్దు చేసింది.

# వైసీపీకి ప్రాణసంకటంగా పీపీపీ

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా నిర్మిస్తున్న వైద్య కళా శాలల నిర్వహణపై పీపీపీ విధానం ఇప్పుడు రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దీనిని ప్రైవేటీకరణ గా అభివర్ణిస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం , పార్లమెంటరీ కమిటీల నుంచి ఈ విధానానికి లభిస్తున్న మద్దతు వైసీపీని ఇరకాటంలోకి నెట్టింది.ఏపీలో పది కొత్త మెడికల్ కాలేజీల నిర్వహణకు పీపీపీ విధానాన్ని అమలు చేయాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయంపై వైసీపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతోంది. ఇప్పటికే కోటి సంతకాల సేకరణతో ప్రజల్లోకి వెళ్లిన వైసీపీ, ఇది పేదల వైద్యానికి తీరని ద్రోహమని ఆరోపిస్తోంది. అయితే, ఈ పోరాటంలో ఆ పార్టీకి ఇప్పుడు స్వంత ఎంపీల నుంచి, అటు కేంద్రం నుంచి అనూహ్య సవాళ్లు ఎదురవుతున్నాయి. వైద్య విద్యలో పీపీపీ విధానం మేలని పార్లమెంటరీ స్థాయి సంఘం స్పష్టమైన సిఫార్సులు చేసింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ కమిటీలో వైసీపీ ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి సభ్యుడిగా ఉన్నారు. ఈ అంశంపై టీడీపీ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టిన గురుమూర్తి.. తాము పీపీపీని కేవలం కొత్త ప్రాజెక్టులకే సూచించామని, ఇప్పటికే పూర్తైన లేదా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నామని వివరణ ఇచ్చారు. అయితే, కమిటీ నివేదికపై సంతకం చేసిన తర్వాత ఇప్పుడు బయట వ్యతిరేకించడం రాజకీయంగా వైసీపీకి కొంత ఇబ్బందికరంగా మారిందిపీపీపీ విధానాన్ని ప్రైవేటీకరణగా చిత్రీకరిస్తున్న వైసీపీకి కేంద్ర మంత్రి జేపీ నడ్డా ప్రభుత్వానికి రాసిన లేఖ రూపంలో పరోక్షంగా గట్టి కౌంటర్ ఇచ్చారు. పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదని, ఇది మౌలిక సదుపాయాల వేగవంతమైన అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన సమర్థించారు. అంతేకాకుండా, ఈ ప్రాజెక్టులకు వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద 30 నుంచి 40 శాతం వరకు మూలధన సబ్సిడీని కేంద్రం అందిస్తుందని, నిర్వహణ వ్యయంలోనూ 25 శాతం భరిస్తామని ఏపీ ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో వైసీపీ చేస్తున్న అవినీతి ఆరోపణలు తేలిపోయినట్లయింది. ఇప్పుడు పీపీపీ విధానాన్ని వైసీపీ వ్యతిరేకిస్తే బీజేపీపైనా ఆరోపణలు చేసినట్లే. కేంద్రంపై కూడా యుద్ధం చేసినట్లే. ఢిల్లీ స్థాయిలో బీజేపీతో సఖ్యతగా ఉంటూ, రాష్ట్రంలో మాత్రం అదే బీజేపీ మద్దతు ఇస్తున్న విధానాలను వ్యతిరేకించడం వైసీపీకి సవాలుగా మారింది. ఇప్పటికి ఇప్పుడు బీజేపీని వ్యతిరేకిస్తూ వైసీపీ ఉద్యమాలు చేసే పరిస్థితుల్లో లేదు. అందుకే ఈ నిందను కేవలం చంద్రబాబుపైకి నెట్టేందుకే వైసీపీ మొగ్గు చూపుతోంది. అయితే ఇప్పుడు వెనక్కి తగ్గితే వైసీపీ పోరాటం నవ్వుల పాలవుతుంది. అందుకే పీపీపీ విధానం ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందదని, మెనేజ్మెంట్ కోటా సీట్లను రూ. 60 లక్షల వరకు అమ్ముకుంటారని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసీపీ భావిస్తోంది. ఇప్పటికే గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చిన వైసీపీ, అవసరమైతే కోర్టులను ఆశ్రయించేందుకు సిద్ధమవుతోంది. మొత్తం మీద, ఒకవైపు కేంద్రం నుంచి 40% సబ్సిడీ హామీ , పార్లమెంటరీ కమిటీ క్లీన్ చిట్ ఉండటంతో, వైసీపీ చేస్తున్న ప్రైవేటీకరణ ప్రచారం క్షేత్రస్థాయిలో తేలిపోతోందన్న భావన వ్యక్తమవుతోంది.



# 100 పర్సెంట్ కనెక్టివిటీ దిశగా అడుగులు

**విశాఖపట్టణం :** ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో మొబైల్ కనెక్టివిటీపై ఫోకస్ పెట్టింది. మొబైల్ సిగ్నల్స్‌ను మెరుగుపరిచేందుకు సిద్ధమైంది.. మారుమూల ప్రాంతాల్లో కూడా సిగ్నల్స్ వచ్చేలా ప్లాన్ చేస్తోంది. దీని కోసం కొత్తగా 707 టవర్లను ఏర్పాటు చేయాలని ప్లాన్ చేసింది.రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాలను గుర్తించి ఈ టవర్లు ఏర్పాటు చేస్తారు. 'డిజిటల్ భారత్ నిధి' పథకం కింద ఈ వ్యాయాన్ని కేంద్రం భరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ టవర్లకు అవసరమైన స్థలాన్ని ఇస్తుంది.ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ సిగ్నల్ సమస్యలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది. కొత్తగా 707 సెల్ టవర్లను ఏర్పాటు చేస్తోంది. ఈ సెల్ టవర్ల నిర్మాణ వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం 'డిజిటల్ భారత్ నిధి' పథకం ద్వారా భరిస్తుంది. అయితే, టవర్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని మాత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ వంటి సంస్థలు ఈ టవర్లను ఏర్పాటు చేస్తాయి. రాష్ట్రంలోని మారు మూల, ఏజెన్సీ ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్‌ను మెరుగుప రచడానికి ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది.రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. సెల్ ఫోన్ల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంతో, ఉన్న టవర్లు సరిపోవడం లేదు. దీనివల్ల మారుమూల ప్రాంతాల్లో, అలాగే తరచుగా సిగ్నల్ సమస్యలు వచ్చే చోట్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించడానికి, ప్రభుత్వం కొత్తగా టవర్లు నిర్మించాలని ఆలోచిస్తోంది. కొత్త టవర్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి రెవెన్యూ శాఖకు చెందిన ఖాళీ స్థలాలతో పాటు, ఏజెన్సీ ప్రాంతాల్లోని అటవీ భూములు కూడా అవసరం అవుతాయి. కొన్ని చోట్ల టవర్ల నిర్మాణానికి అవసరమైన యంత్రాలు, సామగ్రిని తరలించడానికి సరైన రోడ్డు మార్గాలు కూడా లేవని అధికారులు గుర్తించారు. ఇది నిర్మాణ పనులకు అడ్డంకిగా మారుతోంది.అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. ఈ జిల్లాలోని చాలా గిరిజన గ్రామాల్లో సెల్ ఫోన్ నెట్‌వర్క్ సరిగా పనిచేయడం లేదు. ఈ ఒక్క జిల్లాలోనే 100 కొత్త టవర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలో భాగంగా, అధికారులు ఇప్పటికే 42 ప్రదేశాలలో జాయింట్ సర్వేను పూర్తి చేశారు. మరో 13 స్థలాలను టవర్ల ఏర్పాటు కోసం సంబంధిత టెలికాం సంస్థలకు అప్పగించారు. ఈ చర్యల ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన కమ్యూనికేషన్ సదుపాయం అందుబాటులోకి వస్తుందని ఆశిస్తున్నారు. రాష్ట్రంలో నెట్‌వర్క్ వాడకం బాగా పెరిగిపోయింది. దీంతో తరచూ సిగ్నల్ సమస్యలు వస్తున్న ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించింది. టవర్లు అందరికీ సరిపోవట్లేదు.. అందుకే, ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించడానికి ముందుకు వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 4జీ సేవలను మెరుగుపరచడానికి 624 కొత్త టవర్లను ఏర్పాటు చేయాలని ప్రణాళిక వేసింది. ఈ కొత్త టవర్లను ఎక్కడ ఏర్పాటు చేయాలో అధికారులు పరిశీలించారు. కొత్త జిల్లాల ఆధారంగా స్థలాలను గుర్తించారు. ఇప్పటికే 295 ప్రాంతాల్లో సర్వేలు పూర్తయ్యాయి. ఈ సర్వేల ఆధారంగా, 37 లొకేషన్లను టవర్ల నిర్మాణానికి ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ చర్యల వల్ల రాష్ట్రంలో సిగ్నల్ సమస్యలు తగ్గుతాయని ఆశిస్తున్నారు.



## కొబ్బరి రైతులకు హామీ ఇచ్చాం.. అమలు చేశాం

-మొదటిపేజీ తరువాయి

మహేష్ కుమార్, జల వనరుల శాఖ అధికారులున పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. 45 రోజుల్లో సమస్య పరిష్కారానికి యాక్షన్ ప్లాన్ తో వస్తామని చెప్పాం. 35 రోజుల్లోనే శంకరగుప్తం డ్రెయిన్ ఆధునికీకరణకు అడుగులు వేశాం. రైతుల ఆవేదన మనసుతో విని నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటుంది. అన్నం పెట్టే రైతుకు అండగా నిలబడుతుంది కూటమి ప్రభుత్వం. మన రాష్ట్రం రైతు కన్నీరు పెట్టని రాష్ట్రంగా ఉండాలన్నది కూటమి ఆకాంక్ష. ఆ దిశగా అడుగులు వేస్తున్నాము. గత నెలలో రాజోలు పర్యటనకు వెళ్లినప్పుడు సముద్రం పోటుతో శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఏ విధంగా సమస్యగా మారి కొబ్బరి తోటలు నాశనం అవుతున్నాయో చూశారు. మరో కొబ్బరి చెట్టు దెబ్బతినక ముందే ఈ సమస్యను పరిష్కరించాలని నిర్ణయించుకున్నా. ముక్కోటి ఏకాదశి రోజున శంకరగుప్తం డ్రెయిన్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రూ. 20.62 కోట్ల అంచనా వ్యయంతో శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ 8.50 కిలోమీటర్ నుంచి 16.50 కిలోమీటర్ వరకు ద్వారా పూడిక తీత పనులు, డ్రెయిన్ మొదలైన ప్రాంతం నుంచి 14.50 కిలోమీటర్ వరకు ఇరువైపులా గట్లు పటిష్టపరచడం తదితర పనులు చేపట్టనున్నారు. శంకరగుప్తం డ్రెయిన్ సమస్యను పరిశీలన చేసేందుకు రాజోలు నియోజకవర్గం కేశవదాసుపాలెం వచ్చినప్పుడు తలలు వాల్చిన కొబ్బరి తోటలు చూస్తే బాధ కలిగింది. రెండు దశాబ్దాల రైతుల ఆవేదన స్వయంగా విన్నాను. సుమారు లక్షన్నర చెట్లు మోడుబారిపోయిన విషయం తెలుసుకుని కలత చెందాను. కొబ్బరి తోటలు లేని కోనసీమను ఊహించలేం. అక్కడ పరిస్థితి చూసి తిరిగి వచ్చిన వెంటనే సమస్యను గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు గారి దష్టికి తీసుకువెళ్లా. 45 రోజుల్లో సమస్య పరిష్కారానికి ఒక యాక్షన్ ప్లాన్ అవసరం అని వివరించా. ఆయన సకాలంలో స్పందించి ఈ రోజున 35 రోజుల్లోపే రూ. 20.77 కోట్లు కేటాయించి ముక్కోటి ఏకాదశి పర్వదినాన పనులు ప్రారంభించే అవకాశం కల్పించారు. డ్రెయిన్ ఆధునికీకరణ చేయడంతో పాటు డ్రెయిన్ ఆక్రమణలు ఉన్న విషయం మా దష్టికి వచ్చింది. శంకరగుప్తం డ్రెయిన్ లో 250 ఎకరాలు అన్యాక్రాంతం అయినట్టు తెలిసింది. ఈ ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ దష్టి సారించాలి. నవంబర్ 26న కేశవదాసుపాలెంలో పర్యటించినప్పుడు తక్షణ ఉపశమన చర్యల ఆవశ్యకతను గుర్తించాం. ఫైలు ముఖ్యమంత్రి గారి కార్యాలయంతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల ముందు ఉంచాం. ఆర్థిక పరిస్థితి చూస్తే ఈ ఏడాది బడ్జెట్ కేటాయించేందుకు నిధుల సమస్య ఉంది. అలాంటి పరిస్థితుల్లో కూడా కోనసీమ కొబ్బరి రైతుల సమస్యను ప్రాధాన్యతాంశంగా స్వీకరించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో నిధులు మంజూరు చేయించుకోగలిగాం. కోనసీమ కొబ్బరి రైతుల సమస్యకు ప్రాధాన్యత ఇచ్చి అండగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. కూటమి ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో చేస్తుంది. త్వరలో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయబోతున్నాం. ఆ దిశలోనే ఇప్పుడు శంకరగుప్తం డ్రెయిన్ కి రూ. 20.77 కోట్లతో ఊపిరిపోయబోతున్నాం. శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ ఆధునికీకరణతో వందలాది మంది కొబ్బరి రైతులకు ఉపసమనం కలుగుతుంది. ఇప్పటి వరకు జరిగిన నష్టాన్ని పూడ్చలేకపోయినా.. భవిష్యత్తు నష్టాన్ని నివారించేందుకు ఆధునికీకరణ పనులు ఉపయోగపడతాయి. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ, ఇతర ఉన్నతాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అమల్లోకి కొత్త జిల్లాలు

మొదటిపేజీ తరువాయి

పలాస రెవెన్యూ డివిజన్ నుంచి టెక్కలి డివిజన్‌కు మార్చింది. సామర్లకోట మండలాన్ని కాకినాడ డివిజన్ నుంచి పెద్దపురం డివిజన్‌కు మారుస్తూ ఏపీ సర్కార్ కీలక మార్పులు చేసింది. అలాగే, పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా రీస్ట్రక్చర్ చేయడం, పెనుగొండను వాసవీ పెనుగొడుగా మార్చడం వంటి మార్పులు కూడా నోటిఫికేషన్‌లో కూటమి సర్కార్ చేర్చింది. అనకాపల్లి జిల్లాలో అడ్డరోడ్డు జంక్షన్‌తో రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయడం, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మండలాలను మార్చడం ద్వారా స్థానిక పరిపాలన మరింత సులభతరం అవుతుందని కూటమి ప్రభుత్వం భావించింది. ఈ మార్పుల ద్వారా జిల్లా పరిపాలన, రెవెన్యూ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి అవకాశం ఉంటుందని ప్రభుత్వం అనుకుంటుంది. ఈ నిర్ణయం గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సమగ్ర సేవలందించడానికి తీసుకున్నట్లు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో పౌరసేవల చేరిక వేగవంతం అవుతుందని... రెవెన్యూ డివిజన్ల మార్పులు, చేర్పులు స్థానిక అధికారుల ప్రవర్తనను మరింత సమర్థవంతంగా చేస్తాయని భావిస్తోంది.

తుది నోటిఫికేషన్ ప్రకారం, రేపటి నుంచి కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల మార్పులు అధికారికంగా అమల్లోకి రానున్నాయి. ప్రజలు, స్థానిక సంస్థలు, అధికారులు అన్ని విధాలుగా ఈ మార్పులకు అనుగుణంగా తమ కార్యక్రమాలను సర్దుబాటు చేసుకోవాల్సి ఉంది. ఈ కొత్త ఏర్పాట్లు ఏపీలో పరిపాలనలో మరింత సమర్థత, ప్రజల చేరికలో సౌలభ్యం, స్థానిక అభివృద్ధికి దోహదపడతాయని అభిప్రాయపడుతుంది. ఏపీలో కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు సమగ్ర సేవలు, వేగవంతమైన పరిపాలన, వనరుల సమర్థవంతమైన వినియోగం అందించగలిగే అవకాశాలు పెరుగుతాయని ఏపీ సర్కార్ అనుకుంటుంది.

## ఏపీ గ్రూప్-2 అభ్యర్థులకు భారీ ఊరట

-మొదటి పేజి తరువాయి

(ఏపీపీఎస్సీ) జారీ చేసిన గ్రూప్-2 నోటిఫికేషన్‌పై పలువురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రధానంగా మహిళలు, దివ్యాంగులు, మాజీ సైనికులు (ఎక్స్-సర్వీస్‌మెన్), క్రీడాకారులకు కేటాయించిన ప్రత్యేక రిజర్వేషన్ పాయింట్లు నిబంధనల ప్రకారం లేవని పిటిషనర్లు ఆరోపించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ రోస్టర్‌ను సరిచేసి, పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసి కొత్తది జారీ చేయాలని కోరారు. దీనిపై సమగ్ర విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం.. పిటిషనర్ల వాదనలను తోసిపుచ్చుతూ తీర్పు వెలువరించింది. అన్ని పిటిషన్లను కొట్టివేయడంతో నియామక ప్రక్రియకు మార్గం సుగమమైంది. ఇప్పటికే గ్రూప్-2 ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు పూర్తయిన నేపథ్యంలో, ఈ తీర్పు అభ్యర్థుల్లో కొత్త ఆశలు రేకెత్తించింది. రోస్టర్ పాయింట్ల వివాదంతో నియామకాలు ఎక్కడ ఆగిపోతాయోనని ఆందోళన చెందుతున్న అభ్యర్థులకు ఈ తీర్పు ఊరటనిచ్చింది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో ఏపీపీఎస్సీ తదుపరి నియామక ప్రక్రియను వేగవంతం చేసే అవకాశం ఉంది.

## ఇలా చేస్తే మీ పార్టీ సమాధే.. జగన్‌పై మంత్రి కొల్లు ఫైర్

**ప్రకాశం :** మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. జగన్ అంటేనే ఒక ఫెయిల్యూర్ పొలిటీషియన్ అంటూ వ్యాఖ్యలు చేశారు. దోచుకోవటం, దౌర్జన్యాలు చేయడం , ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలు చేయడమే అతని విధానమన్నారు. తన విలాసవంతమైన నివాసం కోసం రిషికొండలో రూ.400 కోట్ల ప్రజల సొమ్ముతో విలాసవంతమైన భవనాన్ని కట్టుకున్నారని మండిపడ్డారు. రుషికొండ భవనానికి, యోగాకి లింకు పెడుతున్నాడు అంటే ఇలాంటి వ్యక్తులు ఉండటం దురదృష్టకరమన్నారు. యోగా అనేది మన సనాతనమైన ఆస్తి అని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చొరవతో 2014 నుంచి ప్రతి సంవత్సరం దేశంలో ఒక్కో ప్రాంతంలో నిర్వహిస్తున్నారని అన్నారు. వైజాగ్‌లో నిర్వహించిన యోగా డే ఖర్చు రూ.18 కోట్లు అని.. దానిని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. యోగా వల్ల ప్రజల మానసిక శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. ఏపీ ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాపై ప్రజలకు అవగాహన కల్పిస్తే, అవగాహన లేని జగన్ దానిని రాజకీయం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ గురించి ఏం మాట్లాడాలో అర్థం కావట్లేదన్నారు. అతనికి ప్రజలే తగిన తీర్పునిచ్చారని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌ను మరలా రివైజ్ చేస్తున్నామని.... లాభాలలో నడుస్తోందని అన్నారు. అభివృద్ధి చేస్తున్నా ప్రజలను తప్పుదోవ పట్టించే దుర్మార్గమైన మనస్తత్వం కలిగిన వ్యక్తిగా జగన్ ఉన్నారంటూ విరుచుకుపడ్డారు. ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రం అభివృద్ధి చెందటం జగన్మోహన్ రెడ్డికి ఇష్టం లేదన్నారు. జగన్ ఇలాంటి కార్యక్రమాలు చేస్తే వైఎస్ఆర్ పార్టీ సమాధిగా మారి పోతుందంటూ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

# నూతన సంవత్సరం- వేడుకలు తగిన జాగ్రత్తలు తీసుకోండి

- సంతోషంగా నిర్వహించుకోండి
- పోలీసులు తెలియజేసే సూచనలు, నిబంధనలు పాటించి సహకరించండి
- నూతన సంవత్సర వేడుకల లో శృతి మించితే కఠిన చర్యలు
- అనంతపురంతో పాటు మిగితా మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాలలో ప్రత్యేక నిఘా...
- జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు
- డ్రంకన్ డ్రైవ్ పై జిల్లా అంతటా స్పెషల్ డ్రైవ్
- ప్రత్యేక పోలీసు బృందాలు మోహరింపు... డ్రోన్లు ద్వారా ప్రత్యేక నిఘా... సిసికెమెరాల ద్వారా పర్యవేక్షణ
- జిల్లా ప్రజలందరికీ ఆంగ్ల నూతన సంవత్సరం- 2026 శుభాకాంక్షలు
- జిల్లా ఎస్పీ పి.జగదీష్

**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం డిసెంబర్ 30:** ఆంగ్ల నూతన సంవత్సరం- 2026 వేడుకలను నిర్వహించుకునే సమయంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా... పిల్లలు, పెద్దలు అందరూ తమ ఇళ్లలోనే ఉత్సవ వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ జారీ చేసే సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతపురం నగరంతో పాటు అన్ని మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ తరపున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని ఎస్పీ గారు తెలిపారు.



డిసెంబర్ 31 రాత్రి నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం మొత్తం అప్రమత్తంగా ఉండి, పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర పెట్రోలింగ్, బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు, ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రోన్లు ఫ్లై చేసి అల్లర్లు, న్యూసెన్స్ చేసే మరియు ఏవైనా వీధిలైట్లు పగులగొట్టడం, ఈవ్ టీజ్ చేయడం లాంటి ఘటనలను నియంత్రించేందుకు నిఘా వేస్తామన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పోలీసుల సూచనలు & నిబంధనలు : నూతన సంవత్సర వేడుకల కార్యక్రమాలు రాత్రి 01:00 గంటలోపు ముగించాలి. అనంతరం కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మద్యం దుకాణాలు నిర్ణీత సమయానికే మూసివేయాలి. రహదారులను బ్లాక్ చేసి వేడుకలు నిర్వహించవద్దుమహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలుఇతరులకు ఇబ్బందులు కలిగించే చర్యలకు పాల్పడవద్దు.

- టపాసులు, డీజే లు నిషేధం.
- మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరం.బహిరంగ ప్రదేశాల్లో లేదా ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేయబడతాయి.ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ తొలగించి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం సృష్టిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు.

ఆంగ్ల నూతన సంవత్సరం - 2026 వేడుకలను జిల్లా ప్రజలు ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థి భౌతికాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన పుట్టపర్తి ఎమ్మెల్యే

## - అంత్యక్రియలకు హాజరై తల్లిదండ్రులను ఓదార్చిన పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి

**అంకుశం ప్రతినిధి కొత్తచెరువు డిసెంబర్ 30 :** కొత్త చెరువు మండలం మీర్జాపురానికి చెందిన ఎస్టీ వర్గానికి చెందిన హనుమంతు కుమారుడు తలమర్ల ప్రభుత్వ పాఠశాలలో 10 వతరగతి చదివే విద్యార్థి చరణ్ (15) సమీపంలోని బహిర్భూమికి వెళ్లి అక్కడే ఉన్న బావిలో పడి మృతి చెందారు. ఈ మరణ వార్త తెలుసుకున్న పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి బావిలో పడిన విద్యార్థి చరణ్ మృతదేహాన్ని తక్షణం వెలికి తీయాలని స్థానిక పోలీసులకు ,ప్రభుత్వ అధికారులకు సూచించారు. బావిలో పడిన విద్యార్థి మృతదేహాన్ని తీయడానికి పోలీసులు మోటార్ల సహాయంతో చరణ్ మృతదేహాన్ని బయటకి తీశారు. విద్యార్థి చరణ్ అంత్యక్రియలకు మంగళవారం పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా హాజరయ్యారు. చరణ్ భౌతికాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు చదువుకునే విద్యార్థి చరణ్ మృతి అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ తీవ్ర తీవ్ర విషాదానికి గురై కన్నీటిపర్వంతమైన తల్లిదండ్రులు హనుమంతు సాయమ్మను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఓదార్చారు. తల్లిదండ్రులకు ఆ దేవుడు కడుపుకోత మిగిల్చాడని ఎమ్మెల్యే





తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. 10 వ తరగతి చదివే విద్యార్థి చరణ్ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందడం తనను తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తీవ్ర విచార వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వపరంగా ఆ కుటుంబానికి అండగా ఉండి ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు కొత్తచెరువు మండల టిడిపి కన్వీనర్ వడ్డెర్ల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు ,రామకృష్ణ ,తలమర్ల సింగిల్ విండో అధ్యక్షులు గోపాల్ రెడ్డి, టీడీపీ సీన నాయకులు సాలెక్క శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డి ,సూరి , కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# నూతన సంవత్సర వేడుకలు సంతోషంగా నిర్వహించుకోండి..

- పోలీసుల నిబంధనలు తప్పక పాటించాలి..అతిక్రమిస్తే కఠిన చర్యలు..
- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి డిసెంబర్ 30:** నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ప్రజల ప్రాణాలు మరియు ఆస్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీసతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయకర రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున, అటువంటి ఘటనలను పూర్తిగా నివారించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.డ్రంక్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలుమద్యం సేవించి వాహనం నడిపితే మోటారు వాహనాల చట్టం-1988 లోని సెక్షన్ 185 కింద కేసులు నమోదు చేయబడతాయని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు.

**ప్రత్యేక చెక్‌పోస్టులు & తనిఖీలు**

నూతన సంవత్సర వేడుకల సమయంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, డ్రంక్ డ్రైవింగ్ చెక్‌లు నిరంతరంగా నిర్వహించబడతాయని తెలిపారు.



**ఇతర ట్రాఫిక్ ఉల్లంఘనలపై చర్యలు**

ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, వీలింగ్, స్టంట్లు చేయడం, అధిక శబ్దం చేసే సైలెన్సర్లు వినియోగించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే వాహనాలను సీజ్ చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మైనర్ డ్రైవింగ్‌పై చర్యలు

**సోషల్ మీడియాలో నిఘా**

సోషల్ మీడియాలో ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వీడియోలు, రీల్స్ పోస్ట్ చేసినా కేసులు నమోదు చేయబడతాయని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు

**ప్రజలకు విజ్ఞప్తి**

జిల్లా ప్రజలందరూ నూతన సంవత్సర వేడుకలను బాధ్యతాయుతంగా, శాంతియుతంగా, సురక్షితంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ గౌరవ సతీష్ కుమార్ విజ్ఞప్తి చేశారు

# రాష్ట్ర స్థాయి ప్రతిష్టాత్మక డాక్టర్ అబ్దుల్ హక్ అవార్డు గ్రహీత అంజద్ భాష సిద్ధికికి ఘన సన్మానం


## - కర్నూలు అబ్దుల్ హక్ యూనివర్సిటీలో అంజాద్ భాష సిద్ధికి సన్మాన కార్యక్రమం

**అంకుశం న్యూస్ కర్నూల్ డిసెంబర్ 30:** రాష్ట్రస్థాయిలో ప్రతిష్టాత్మకంగా పేర్కొనే డాక్టర్ అబ్దుల్ హక్కు అవార్డు అందుకున్న నంద్యాల జిల్లా ఇమాముల సంఘం అధ్యక్షుడు, జమితతే ఉలమాయే హింద్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు అంజద్ భాష సిద్ధికిని అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ పి.ఎస్. షా వలి ఖాన్, యూనివర్సిటీ ప్రిన్సిపల్ ఎస్. మహబూబ్ బాషా, బృందం సభ్యులు ఘనంగా సన్మానించారు. కర్నూలులోని అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ప్రత్యేక ఆహ్వానం మేరకు రాష్ట్రస్థాయి డాక్టర్ అబ్దుల్ హక్ అవార్డు గ్రహీత అంజాద్ భాష సిద్ధికి యూనివర్సిటీని పరిశీలించారు. ఉర్దూ యూనివర్సిటీకి వెళ్లిన సందర్భంగా అవార్డు గ్రహీత అంజాద్ భాష సిద్ధికిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సర్ పి.ఎస్. షా వలి ఖాన్ మాట్లాడుతూ ముస్లింల అభ్యున్నతికి వారికి చేయూతనందిస్తున్న అంజద్ భాష సిద్ధికికి ప్రతిష్టాత్మకమైన అవార్డును రాష్ట్ర ప్రభుత్వం అందియడం ఆనందంగా ఉందని తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నంద్యాల ప్రాంతానికి చెందిన ఆయనకు అవార్డు ఇవ్వడంతో కర్నూల్లోని అబ్దుల్ హక్ యూనివర్సిటీ ఖ్యాతి మరింతగా పెరిగిందని గుర్తు చేశారు. అవార్డు గ్రహీత అంజాద్ భాష సిద్ధికిని సన్మానించడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. అంజాద్ భాషా సిద్ధికి మరెన్నో అవార్డులు అందుకోవాలని ఆ అల్లాను ప్రార్థించారు. సన్మాన గ్రహీత అంజాద్ భాష సిద్ధికి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఇంతటి ప్రతిష్టాత్మకమైన అవార్డును అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కర్నూల్ లోని




ఉర్దూ యూనివర్సిటీని అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తానని తెలిపారు.

# వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తూర్పు తిరుమల వేంకటేశ్వరుని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే సత్తి దంపతులు





**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ డిసెంబర్ 30:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామంలో తూర్పు తిరుమలగా ప్రసిద్ధిగాంచిన శ్రీ శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి శ్రీమతి ఆదిలక్ష్మి దంపతులు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొవ్వూరి సత్తిరెడ్డి (ఫైనాన్స్ సత్తిబాబు), నల్లమిల్లి రామచంద్రారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు కొవ్వూరి వెంకటరామారెడ్డి, పడాల వెంకటరెడ్డి, మేడపాటి సోమిరెడ్డి, నల్లమిల్లి వెంకట కృష్ణారెడ్డి, గొర్రిపూడి శ్రీనివాసరావు, ఎల్ల బుచ్చిలింగం, పేరూరి మణికంఠ, గుత్తుల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరం లో వైభవంగా జరిగిన ముక్కోటి ఏకాదశి వేడుకలు!

**అంకుశం న్యూస్ ధర్మవరం డిసెంబర్ 30:** పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా ఆలయ అడహక్ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్, ఆలయ ఈవో వెంకటేశు లు, దాతలు, భక్తాదుల ఆధ్వర్యంలో నిర్వహించారు. తెల్లవారుజామున రెండు గంటల నుండి భక్తాదులకు స్వామివారి దర్శనాన్ని కల్పించారు. భక్తులకు ఉత్తర ద్వారా ప్రవేశము దక్షిణ ద్వారా ప్రవేశము నిర్వహించారు. ఈ ముక్కోటి ఏకాదశి వేడుకల్లో భాగంగా ధర్మవరం కోర్టు జడ్జీలు,జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, ఇతర అధికారులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ పూలలతో , విద్యుత్ దీప అలంకరణతో అలంకరించిన వైనం భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఒక లక్ష రూపాయల నుండి 500 రూపాయల వరకు దాతలు సహకరించడంతో, తిరుమల తిరుపతి లో నిర్వహించే విధంగా ఈ వేడుకలు జరిగాయి. చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్, ఆలయ ఈవో వెంకటేశులు, సిబ్బంది అనునిత్యం పర్యవేక్షణ చేస్తూ భక్తాదులకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించారు. గతంలో కన్నా ఈ సంవత్సరం అధిక సంఖ్యలో భక్తాదుల హాజరు కావడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. అర్చకులు కొనేర ఆచార్యులు ,మకరంద బాబు, భాను ప్రకాష్, చక్రధర్లు వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడిమ వివిధ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన వైనం భక్తాదులను భక్తి మార్గంలో పయనింపజేసేటట్లు చేసింది. అన్నమయ్య సేవా మండలి అధ్యక్షులు పోరాల పుల్లయ్య ఆలపించిన స్వామివారి పాటలు విశేషంగా భక్తాదులను ఆకట్టుకుంది. స్వామివారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు వందల సంఖ్యలో భక్తాదులు క్యూ లైన్ లో ఉండక తప్పలేదు. డి.ఎస్.పి హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్త్ చర్యలు గైకొన్నారు. ఆలయం వద్ద ప్రత్యేక క్యూ లైన్ కూడా ఏర్పాటుచేసి భక్తాదులకు సహకారాలు అందించారు.



# చంద్రబాబు జీవితమే ఒక చరిత్ర..

- ఏపికి 15 ఏళ్లు సీఎంగా చంద్రబాబు రికార్డ్ పుస్తకావిష్కరణ లో ఎంపీకేశినేని శివనాథ్







**అంకుశం ప్రతినిధి విజయవాడ డిసెంబర్ 30:** సీఎం చంద్రబాబు ముందుచూపు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తుంది. భావితరాల భవిష్యత్తును దృష్టిలో పరిపాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో మంది ఆదర్శంగా నిలుస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. శ్రీ నగరాల సంఘం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాయన శేఖర్ బాబు రచించిన ఆంధ్రప్రదేశ్ 15 ఏళ్ల ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించిన నారా చంద్రబాబు నాయుడు పుస్తకావిష్కరణ కార్యక్రమం పశ్చిమ నియోజకవర్గం చిట్టి నగర్ సెంటర్ వద్ద గల నగరాలు సీతారామస్వామి , శ్రీ మహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థానం కళ్యాణమండపంలో మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ కేశినేని శివనాథ్, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా, జనసేన విజయవాడ పార్లమెంట్ సమన్వయకర్త అమ్మిశెట్టి వాసు లతో కలిసి ఆంధ్రప్రదేశ్ 15 ఏళ్ల ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించిన నారా చంద్రబాబు నాయుడు పుస్తకాన్ని ఆవిష్కరించారు. విజనరీ లీడర్ సీఎంచంద్రబాబు పై పుస్తకం రచించిన రచయిత భాయన శేఖర్ బాబుకి అభినందనలు తెలుపుతూ సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు పై పుస్తకం రచించిన భాయన శేఖర్ బాబు ను అభినందించారు. దేశంలో ఆదర్శవంతులుగా వున్న నాయకుల్లో సీఎం చంద్రబాబు నాయుడు ఒకరని తెలిపారు. కృష్ణా-గోదావరి నదుల అనుసంధానం చేసి ఎంతోమంది ఆదర్శంగా, మార్గదర్శిగా నిలిచారని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పనికి ఆహార పథకం, డ్వాక్రా సంఘాలు వంటి వాటిని ఎన్నో పథకాలను ఆదర్శంగా తీసుకుని అమలు చేయటం సీఎ చంద్రబాబు నాయుడు విజన్ కి నిదర్శనమన్నారు. అలాగే పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ద పెట్టారని తెలిపారు. విజయవాడ ఓల్డ్ సిటీని న్యూ సిటీగా అభివృద్ధి చేసేందుకు పూర్తి మద్దతు ఇచ్చారని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో శ్రీ నగరాల సంఘం ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ ఎన్.వి.రావు, లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ముక్కోటి ఏకాదశి సందర్భంగా
# వాడపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తజనకోటి

**- ముక్కోటి ఏకాదశి కి ముస్తాబైన వాడపల్లి దేవాలయం**
**- ఉదయం 5 గంటల నుంచి ఉత్తరద్వార దర్శనం**




**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ డిసెంబర్ 30:** ధనుర్మాసంలో వచ్చే ముక్కోటి ఏకాదశి పర్వదినానికి కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి దేవాలయం ముస్తాబైంది. మంగళవారం ఉదయం 5 గంటల నుంచి స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తారు. ఈ పర్వదినాన్న స్వామి వారిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలి వస్తారు. అందుకనే అనేక రకాల పష్పలతో దేవాలయ ప్రాంగణమంతా అద్భుతంగా తీర్చిదిద్దారు. స్థానికంగా లభ్యమయ్యే బంతి, చామంతి పూలతో పాటు బెంగళూరుకు చెందిన అనేక రకాల అరుదైన పుష్పాలు, పత్రాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణమంతా ఈ పూల అలంకరణతో కళకళాడిపోతుంది. ముక్కోటి ఏకాదశి సందర్భంగా వచ్చే భక్తులు కోసం ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాటు చేసింది. ఈ దేవస్థాన ధర్మ కర్తల మండలి ప్రమాణ స్వీకారం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. మర్నాడే అంటే మంగళవారం ముక్కోటి ఏకాదశి రావడం నూతన ధర్మకర్తల మండలిలో ఎక్కడలేని ఉత్సాహం నెలకొంది.



# అభివృద్ధిని కేంద్రీకరిస్తే ప్రతిఘటిస్తాం!

**- వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి నారాయణ రెడ్డి**



**అంకుశం ప్రతినిధి విజయవాడ డిసెంబర్ 30:** అభివృద్ధిని కేంద్రీకరిస్తే ప్రతికటిస్తామని అన్ని ప్రాంతాల్లో సమానంగా అభివృద్ధి జరగాలని లేకపోతే పోరాటం తప్పదని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి నారాయణ రెడ్డి హెచ్చరించారు. ఈరోజు విజయవాడ ప్రెస్ క్లబ్ లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో వేదిక నాయకులు మాట్లాడుతూ అమరావతి అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధి గా ముందుకు పోతున్న కూటమి ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని, ఈ రాష్ట్రంలో గల అత్యంత వెనుకబడి ప్రాంతాల ప్రజల ప్రతిఘటనను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కేవలం 30వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడితే పూర్తి అయ్యే రాయలసీమ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిగోదావరి-బనకచర్ల, గోదావరి- నల్లమల సాగర్, గోదావరి- కావేరిలి అంటూ సాధ్యం గాని ప్రకటనలు గుప్పిస్తూ, ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని, లక్ష కోట్లతో అమరావతిని నిర్మించడానికి లక్ష ఎకరాలు భూసేకరణ పేరుతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, వీరు మాత్రం భూ దందాలు చేసుకొని కోట్లు గడిస్తున్నారని,

దేశంలోనే అతి తక్కువ వర్షపాతం కలిగి, అత్యంత కరువు పీడిత ప్రాంతమైన అనంతపురం జిల్లాలో ఈ ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే 3850 కోట్లు ఖర్చు చేసి హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులు ఆగమేఘాల మీద చేపట్టి, నీటికి బదులు అవినీతిని పారించి ప్రజాధనాన్ని కొల్లగొట్టిన ఫలితంగా హంద్రీ-నీవా లక్ష్యం ఏమాత్రం నెరవేరలేదని, అక్కడ జరిగిన అవినీతిపై విజిలెన్స్ లేదా ఏసీబీతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే కేవలం 4000 కోట్లు ఖర్చు పెడితే గ్రావిటీ మీద ఐదు లక్షల ఎకరాలకు నీళ్లు పారే వెలుగొండ రిజర్వాయర్ ను నిర్లక్ష్యం చేయడం తగదని హెచ్చరించారులిజనవరి 24వతేదీన తిరుపతిలో జరుప తలపెట్టిన వెనుకబడిన ప్రాంతాల సదస్సులి లో ఈ ప్రాంతాల అభివృద్ధి పై చర్చించి భవిష్యత్తు కార్యక్రమాలు రూపొందిస్తామని, ఈ సదస్సులో విద్యావంతులు, మేధావులు, న్యాయ నిపుణులు, అన్ని రాజకీయ పార్టీలు, ఆయా రంగాల నిపుణులను, ఆహ్వానిస్తున్నామని, నీళ్లు, నిధులు, నియామకాలు అన్ని ప్రాంతాలలో ఏక కాలంలో సమానంగా అమలు జరగాలని, ఈ ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.నారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్యాంప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వి. రమణ, రాష్ట్ర నాయకులు జి.నారాయణ రెడ్డి, నూర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## అనంతలో ప్రశాంతంగా
## వైకుంఠ ఏకాదశి దర్శనాలు

**- భక్తుల ప్రశాంత దర్శనాలు, భద్రత కోసం జిల్లా ఎస్పీ పి. జగదీష్, ప్రత్యేక కృషి**





**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం డిసెంబర్ 30:** అనంతపురం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు జరిగాయి అనంతపురం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు తీసుకున్నారు అనంతపురం నగరంలో జిల్లా ఎస్పీ పి జగదీష్ నేరుగా రంగం లోకి దిగి భక్తులకు పలు సూచనలు చేస్తూ ప్రశాంతంగా జరగడానికి కృషి చేశారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రధాన వైష్ణవ దేవాలయాల్లో భక్తులకు ప్రశాంత దర్శనాలు కోసం జిల్లా ఎస్పీ పి. జగదీష్, ప్రత్యేక కృషి చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భద్రతా చర్యలు చేపట్టారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న పాతవూరులోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయం మరియు రైల్వే ఫీడర్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి దేవాలయాలు వద్ద స్వయంగా వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించారు. భక్తుల రాకపోకలను సమన్వయం చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, సౌకర్యవంతంగా, ప్రశాంతంగా దర్శనాలు జరిగేలా చర్యలు తీసుకున్నారు.

ఈ ఏర్పాట్ల ద్వారా, భక్తులు ఆనందంగా, సౌకర్యవంతంగా, ప్రశాంతంగా పూజలు, తీర్థప్రసాదాలు స్వీకరించగలిగారు. జిల్లా ఎస్పీ జగదీష్ తోపాటు అనంతపురం అర్బన్ డీఎస్పీ వి. శ్రీనివాసరావు, సి.ఐ. ధరణీకిశోర్, క్రాంతికుమార్, వెంకటేశ్వర్లు, రాజేంద్రనాథ్ యాదవ్ తదితర అధికారులు కూడా పాల్గొన్నారు.

## పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలి

**- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**



**అంకుశం న్యూస్ అనంతపురం, డిసెంబర్ 30 :** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చే పారిశ్రామికవేత్తలను అన్ని రకాలుగా ఆయా శాఖల అధికారులు ప్రోత్సహించి పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు తీసుకోవాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసేలా మంచి వాతావరణం కలగజేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో 65వ జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిస్టిక్ ఇండస్ట్రీస్ మరియు ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ ) సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు.

- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టము చేసేలా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి వారికి సకాలంలో సింగల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులను అందజేసి పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిఎంఈజిపి పథకం ద్వారా అర్హులైన వారి నుండి నాణ్యతగల పథకాలను ఎంపికచేయాలని జిల్లా పరిశ్రమల అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీలో 2 యూనిట్లకుగాను విద్యుత్ రాయితీలకు 29 వేల 777 రూపాయలు, వడ్డీ రాయితీ కింద 2 యూనిట్లకుగాను 2 లక్షల 37 వేల 142 రూపాయలు, పెట్టుబడి రాయితీ కింద 5 యూనిట్లకుగాను 2 కోట్ల 49 లక్షల 78 వేల 151 రూపాయలు, అమ్మకపు పన్ను రాయితీ కింద 1 యూనిట్లకుగాను 28 లక్షల 85 వేల 711 రూపాయలు, స్టాంప్ డ్యూటి రాయితీ కింద 1 యూనిట్లకుగాను 1 లక్షల 02 వేల 235 రూపాయలు, సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. సింగిల్ విండో పోర్టల్ లో పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకున్న అనుమతులను నిర్ణీత సమయంలో ఆమోదించాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి విరివిగా రుణాలు మంజూరు చేపించాలని ఎల్డిఎంని ఆదేశించారు. ఎఎస్ఎంఈ పార్కులలో ఇంజనీరింగ్ పనులు జనవరిలోపు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో పెద్ద, మెగా ప్రాజెక్టులైన సోలార్, విండ్, నేషనల్ హైవే, రైల్వే, తదితర ప్రాజెక్టులకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదిక అందజేయాలని, ప్రాధాన్యత ప్రకారం భూ సేకరణ, భూ బదలాయింపు చేపట్టాలన్నారు. ఏపిఐఐసి పారిశ్రామికవాడలలో ఇంకా ఉత్పత్తి ప్రారంభించని యూనిట్లను వెంటనే ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని జెడ్ఎం ఏపిఐఐసిని ఆదేశించారు.

- ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస యాదవ్, ఏపీఐఏసి జెడ్ఎం నాగకుమార్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, లేబర్ డిసి లక్ష్మీ నరసయ్య, కమర్షియల్ ట్యాక్స్ ఏసిటీవో కృష్ణారెడ్డి, డిటిసి వీర్రాజు, మైన్స్ డిడి ఆదినారాయణ, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, డిఎస్డిఓ ప్రతాప్ రెడ్డి, ఎల్డిఎం నరేష్ రెడ్డి, ఫ్యాప్సీ ప్రతినిధి రంగారెడ్డి, ఏపీఎస్ఎఫ్సి బ్రాంచ్ మేనేజర్ హమీద్ అన్సారి, ఫ్యాఫ్సియ ప్రతినిధి నాగరాజు, డిఐఏ ప్రతినిధి రాజశేఖర్, డిక్కీ ప్రతినిధి నరసింహులు, హ్యాండ్లూమ్ ఎడి వరప్రసాద్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డిటి జిల్లా బాలికల హాకీ లీగ్
## పోటీల్లో విజేతలు గొట్లూరు హైస్కూల్ విద్యార్థులు.



**అంకుశం న్యూస్ ధర్మవరం డిసెంబర్ 30:** ఆర్ డి టి జిల్లా బాలికల హాకీ లీగ్ పోటీల్లో మండల పరిధిలోని గొట్లూరు హైస్కూల్ విద్యార్థులు విజేతలు కావడం జరిగిందని హెడ్మాస్టర్ జగన్నాథం, ఫిజికల్ డైరెక్టర్ రమేష్ బాబు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ అనంతపురం ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జరిగినటువంటి జిల్లా ఆర్డిటి అండర్ 14 బాలికల హాకీ లీగ్ నందు మా పాఠశాల బాలికల విద్యార్థులు విన్నర్ గా రాణించడం జరిగిందని తెలిపారు. తదుపరి ఫైనాన్స్ నందు గడేకల్ జట్టు మీద 4-0 గోల్స్ తేడాలో ఘనవిజయం సాధించి జిల్లా విజేతగా రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా హెడ్మాస్టరు, పిడి తోపాటు పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ, తల్లిదండ్రులు, పాఠశాల విద్యార్థులు అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

## కదిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్





**అంకుశం న్యూస్ కదిరి డిసెంబర్ 30:** వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ మంగళవారం ఉదయం కదిరి పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో సంప్రదాయ పద్ధతుల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, ఆరాధనలునర్వహించారు. లిఆలయ ప్రవేశద్వారం వద్ద అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య కలెక్టర్‌కు స్వాగతం పలికారు. అనంతరం దీపారాధనలో పాల్గొని, స్వామివారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక ఆశీర్వాదాలు పొందారు. లివైకుంఠ ద్వార దర్శనం సందర్భంగా కలెక్టర్ స్వామివారి ఎదుట నమస్కరించి జిల్లా ప్రజల సంక్షేమం, శాంతి, సుభిక్షం, జిల్లా అభివృద్ధి కోసం ప్రార్థించారు. లిఈ సందర్భంగా ఆలయ వాతావరణం భక్తులతో నిండిపోయి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కలెక్టర్ వెంట కదిరి ఆర్డీవో వీవీఎస్ శర్మ, ఆలయ అధికారులు, రెవిన్యూ సిబ్బంది, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


## లిజేఎన్‌టీయూ లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలి

**- వీసీ కి వినతి:సాకే నరేష్**



**అంకుశం న్యూస్ అనంతపురం:30 డిసెంబర్:** జే ఎన్ టి యు అనంతపురం లో ఖాళీగా ఉన్న టీచింగ్ మరియు నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ న్యాయవాది, బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాకే నరేష్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ వీసీ కి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సాకేనరేష్ మాట్లాడుతూ యూనివర్సిటీలో తగినంత మంది సిబ్బంది లేకపోవడం వల్ల విద్యార్థుల విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కాంట్రాక్ట్ మరియు గెస్ట్ లెక్చరర్లపైనే ఆధారపడి విద్యాబోధన సాగించడం వల్ల, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని పేర్కొన్నారు. ?అలాగే, నాన్-టీచింగ్ సిబ్బంది కొరత కారణంగా పరిపాలనా పరమైన పనుల్లో జాప్యం జరుగుతోందని, తద్వారా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ?కనుక ?యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ మరియు ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి అదేవిధంగా ఖాళీగా ఉన్న నాన్-టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ?త్వరితగతిన నియామక ప్రక్రియను చేపట్టాలని వీసీ ని కోరారు. ఈ సందర్భంగా వీసీ సానుకూలంగా స్పందించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పోతులయ్య, రంగనాయకులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పూల నాగరాజు



**అంకుశం న్యూస్ అనంతపురం డిసెంబర్ 30:** వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో శ్రీ వెంకటేశ్వర స్వామిని ఆర్టీసీ రీజనల్ చైర్మెన్, అనంతపురం జిల్లా టిడిపి అధ్యక్షుడు పూల నాగరాజు దర్శించుకున్నారు. హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి మరియు కుటుంబసభ్యులతో కలిసి నేడు ఉదయం ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి స్వామిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తరద్వారం ద్వారా వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని పూల నాగరాజు గారు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు గారు, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి గారు ప్రజలందరికీ వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేశారు.

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా
## శ్రీవారి సేవలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**ఉత్తర ద్వార దర్శనం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్న ఎమ్మెల్యే**



**అంకుశం న్యూస్ అనంతపురం డిసెంబర్ 30:** వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రాత్రే ఆయన తిరుమల చేరుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున స్వామి వారిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు. అనంతరం ఉత్తర ద్వార దర్శనం కూడా చేసుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా ఆశీర్వచనాలు అందజేశారు. ఎమ్మెల్యే ఆలయం వెలుపులకి రాగానే పలువురు ఎమ్మెల్యేలు కనిపించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతో ఆయన కాసేపు ముచ్చటించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో ఉత్తర ద్వార దర్శనం చేసుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి చెప్పారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా టీటీడీ ఏర్పాట్లు చేసిందన్నారు. భక్తులు కూడా ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు.

## జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ హాకీ పోటీలకు ధర్మవరం క్రీడాకారిణి ఎంపిక



**అంకుశం న్యూస్ ధర్మవరం డిసెంబర్ 30:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్ లో జనవరి రెండవ తేదీ నుంచి ఏడవ తేదీ వరకు జరుగుచున్న జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 14 బాలికల హాకీ ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ధర్మవరం శ్రీ గణేష్ మున్సిపల్ హై స్కూల్ చెందిన విద్యార్థిని శ్రీలేఖ ఎంపికైనట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ బి సూర్య ప్రకాష్ తెలియజేసారు ఎంపికైన క్రీడాకారిణి కి బి.సూర్య ప్రకాష్, గణేష్ హై స్కూల్ హెడ్మాస్టర్ బిల్లే భాస్కరయ్య, అభినందనలు తెలియజేశారు.